# నేహాల



సాయి బ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

# 4

గోధూళి వేళ. పక్షులన్నీ గూటికి చేరుకుంటున్నాయి.

తదియలోంచి చవితిలోకి ప్రవేశించడానికి ఆయత్తమవుతున్నాడు పున్నమి చంద్రుడు.

తండ్రి ఇంకా పొలం నుండి రాలేదని గుమ్మం వద్ద కూర్చుని ఎదురు చూస్తోంది నేహల.

సాధారణంగా ఇంత పొద్దుపోయే వరకూ రాకుండా వుండడు. ఇంకా రాలేదేమిటా అని ఆత్రంగా చూస్తోంది నేహల. లోపల తల్లి వంట పనిలో వుంది.

ఇంట్లోంచి బయటకీ, బయటనుండి ఇంట్లోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతోంది. పొద్దు వాలగానే తండ్రి ఇంటికొస్తాడు. వస్తూనే బావి దగ్గర కెళ్ళి స్నానం చేస్తాడు. పెరట్లో నులక మంచమ్మీద పడుక్కుని తను తండ్రి చెప్పే ఆనాటి విశేషాలు వింటుంది. తను వేదరాయశర్మగారి దగ్గర ఏం నేర్చుకుందో గురుకుల కబుర్లు చెబుతుంది. తండ్రీకూతళ్ళకిదే సాయంత్రపు దినచర్య. తరువాత అందరూ కలిసి భోజనం చేస్తారు.

తండ్రి ఎందుకింకా రాలేదోనని తల్లితో అంటే "వస్తాడు, కంగారెందుకంటూ" విసుక్కుంది. కొంతసేపయ్యాక తండ్రి వచ్చాడు. దూరం నుండే తండ్రిని చూసి నేహల మొహం చేటంతయ్యింది.

"ఏం నాన్నా? ఇంత ఆలస్యమయ్యింది? ఏమయ్యిందా అని కంగారు పడుతున్నాను?"

తండ్రి హరేంద్ర చేతిలో సంచీనీ, మూటనీ అందుకుంటూ అడిగింది.

"కంగారు దేనికమ్మా? ఓ ఘడియ అటూ ఇటూ అవుతుంది. అంతేనా? దారిలో వేదరాయ శర్మగారింటి దగ్గర ఆగాను. - ఆయనతో కాసేపు విజయనగరం ముచ్చట్లు విని వస్తున్నాను.." తండ్రి నవ్వుతూ అన్నాడు.

పక్కగదిలోకి వెళ్ళబోతున్న నేహల వేదరాయశర్మ పేరు వినగానే ఒక్కసారి ఆగి వెనక్కి చూసింది.

"గురువు గారు వచ్చారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవునమ్మా! అప్పుడే బండి దిగుతూ కనిపించారు. వూర్నుండి అప్పుడే వచ్చారు. పలకరింపుల్లో పడి ఇంటరుగు మీద కబుర్లాడుతూ చతికిల బడ్డాం."

వేదరాయశర్మ వచ్చాడంటే రేవన్న కూడా వచ్చినట్లే! మరెందుకు తనని చూడ్డానికి రాలేదు? రానీ చెప్తాను? అప్రయత్నంగా రేవన్న మీద కోపమొచ్చింది నేహలకి.

"రేవన్న కూడా వచ్చాడా?"

"కనిపించలేదమ్మా! బహుశా వాళ్ళింటికెళ్ళాడేమో? వూరొదిలి నాలుగు వారాలవుతోంది కదా? ఇంటి మీద బెంగ వుండదా ఏమిటి?"

నేహల ఏం సమాధానం చెప్పలేదు. అవునన్నట్లుగా తలాడించింది.  ఆ క్షణం రేవన్న ఇంటికి వెళదామనిపించింది. తండ్రినడిగితే ఇంత రాత్రి ఒప్పుకోడు. గురువు గారి ఇంటికని వంకపెట్టి వెళితే? ఆలోచన బానే వుంది. కానీ తనెందుకొచ్చావని రేవన్న అమ్మా, నాన్నా అడిగితే? బావుండదు. అయినా తనెందుకు వెళ్ళడం? మగాడు,  ఆమాత్రం తనని కలవడానికి రాలేడా? మనసు పరి పరివిధాల పోతోంది.

"ఏంటమ్మా? అలా మౌనంగా ఉండిపోయావు?" నేహల ఏం మాట్లాడకపోయే సరికి హరేంద్ర పరికించి చూసాడు.

"ఏం లేదు నాన్నా? గురువుగారింటికెళ్ళి ఓ సారి చూసొస్తే ఎలా వుంటుందాని ఆలోచిస్తున్నాను."

హరేంద్ర ఇంత రాత్రి పూట వద్దని చెప్పాడు. కావాలంటే మర్నాడు ఉదయమే వెళుదువుగానంటూ నేహలకి నచ్చ చెప్పాడు. నేహల తండ్రితో మరోసారి రెట్టించలేదు. ఆమెకి రేవన్న రాలేదన్న కోపమే ఎక్కువగా వుంది.

భోజనాల వద్దా పరధ్యానంగా ఆలోచిస్తూనే వుంది. కూతుర్ని హరేంద్ర గమనిస్తూనే ఉన్నాడు. పైకి మాత్రం ఏమీ అనలేదు.

తల్లికి సాయంగా రాత్రి వంటింట్లో పని త్వరగా ముగించి తనగదిలో మంచమ్మీద వాలిపోయింది నేహల. దిండు కింద రేవన్న తనకు పంపిన సావిరహే పత్రాన్ని మరోసారి చదువుకుంది.

అతని ఆలోచనల్లోకి మెల్లగా జారుకుంటూండగా కిటికీ వద్ద చప్పుడయ్యింది. ఏమిటా అని పక్కమీద నుండి లేచి కిటికీ వద్దకొచ్చింది. దూరంగా అక్కడొక ఆకారం కనిపించింది. మెల్లగా ఆ ఆకారం కిటికీ వైపుగా రావడం కనిపించి, భయంతో ఒక్క సారి పక్కకు జరిగింది. దొంగేమోనని గట్టిగా అరుద్దామనుకుంది. కానీ ఎవరయ్యుంటారా పక్కనుండి చూడడం మొదలు పెట్టింది. వెన్నెల వెలుగులో  ఆ ఆకారాన్ని స్పష్టంగానే చూసింది.  వచ్చింది రేవన్న! మంచమ్మీద తను కనిపించకపోయేసరికి అతని కళ్ళు నేహల కోసం వెతుకుతున్నాయి. అతన్ని గమనించనట్లు నటిస్తూ నేహల మంచమ్మీద పడుకుందామని వెళ్ళింది. ఆమెను చూడగానే అతను పిలిచాడు.

"నేహలా! నేహలా!"

"ఎవరూ?" గట్టిగా పైకంటూ వెనక్కి తిరిగి కిటికీ వైపు చూసింది.

" అరవకు. నేను రేవన్నని." అతను గొంతు తగ్గించి అన్నాడు. నేహల తలెత్తి అతనికేసి చూసింది.

రేవన్న నవ్వుతూ కనిపించాడు. అతనికళ్ళల్లో కాంతి ఆమెపై వాలింది.

"రేవన్నా! ఎప్పుడొచ్చావు?"  కిటికీలోంచే అతని చేతుల్ని తాకుతూ అంది.

"ఇందాకనే వచ్చాను. వివరాలు చెప్తా కానీ -  పెరట్లోకి రా! మాట్లాడు కుందాం."

"అలాగే! కాసేపాగు. అమ్మా నాన్నా పడుక్కోనీ.."

"అలాగే! ఇక్కడే వుండి మాట్లాడుకుందామా?"

రేవన్న విజయనగర విశేషాలు మెల్లగా చెబుతున్నాడు. మధ్యలో ఆపి -

"నేహలా ఎన్ని రోజులయ్యిందో నిన్ను చూసి!" అతని కంట్లో సన్నటి నీటి తెర కనిపించింది నేహలకి.

అంతే ఆమె కంట జల జలా కన్నీటి బొట్లు రాలాయి. అతని చేతులు తీసుకొని ముఖానికి అద్దుకుంది నేహల. కొన్ని క్షణాలయ్యాక, పెరట్లోకి వస్తానంటూ మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ బయల్దేరింది.

ప్రక్క గదిలో అమ్మా, నాన్నా నిద్రపోయినట్లుగానే వుంది. తండ్రి గురక స్పష్టంగా వినిపిస్తోంది. మెల్లగా పెరటి గుమ్మం గడియ తీసి అటు నడిచింది నేహల.

ఒక్క ఉదుటన వెళ్ళి రేవన్నని చుట్టుకుపోయింది.

నాలుగు వారాల నిరీక్షణని హరించాలన్న తాపత్రయం ఇరువురిలోనూ అధికమించింది.

వెన్నెల సాంగత్యం కోసం పరితపిస్తున్న కలువలా వుందామె. అగ్నిశిఖలపై మంచు జల్లు కురిసిన తాపసిలా వున్నాడతను.

అతని వళ్ళో తల వాల్చి ఆమె ఆకాశంలో చంద్రుడి కేసే చూస్తోంది. ఆమె కేశాల్లోకి చేతులు పోనిస్తూ అతనూ ఆకాశంలో తారలకేసే చూస్తున్నాడు. ఎంతసేపలా వున్నారో సమయం తెలియలేదు. వారిరువురినీ చూస్తూ అచేతనంగా ఉండిపోయాడు వినీలాకాశంలో చంద్రుడు.

కొంతసేపయ్యాక అతను ఇంటికెళ్ళడానికి ఉద్యుక్తుడయ్యాడు.

చాలాసేపయ్యిందంటూ లేచి నిలుచున్నాడు.

"నేహలా! చెప్పడం మరిచాను. ప్రభ నీకిచ్చిన సావిరహే లేఖని చూసావా? నేను వచ్చేస్తుంటే, ఆ లేఖపై రాసిన కవిత్వాన్ని మెచ్చుకొని విజయనగరంలో విరూపాక్షాలయం దగ్గర చిత్రకారుడు, మన ప్రేమ గుర్తుగా నాకొకటి బహూకరించాడు. తెలుసా?"

"అలాగా? ఏమిటిచ్చాడు?"

రేవన్న తన తలపాగాలోంచి పద్మాకారంలో ఉన్న తాయత్తు తీసి చూపించాడు.

"ఇది నీకు నేను విజయనగరం నుండి తెచ్చిన ప్రేమ కానుక" అంటూ ఆమె కుడి చేతికి కట్టాడు. పంచభూతాల సాక్షిగా అతను ఆమె చేతికి తాయత్తు అలంకరించాడు..

ఎర్రని రాళ్ళ మెరుగులతో ఆమె చేతిని పతకం మిలమిలా మెరిసిపోతోంది.

"నేహలా! నువ్వు నాకో మాటిస్తావా?"

"ఏమిటి?" పద్మాకారంలో వున్న ఆ పతకాన్నే పదేపదే చూస్తూ అడిగింది.

"నేను జీవించినంత వరకూ నువ్వు ఈ పతకాన్ని నీ చేతి నుండి తీయనని మాటివ్వు.." ఎంతో వుద్వేగంగా అన్నాడతను.

అతని మాటల్లో ప్రేమనీ, అనురాగాన్నీ ఆమె గ్రహించింది..

అలాగే అన్నట్లు అతని చేతిలో చేయి వేసి, ప్రమాణం చేసింది.

"రేవన్నా! నేనెంతో అదృష్టవంతురాలనని నిన్న ప్రభ అంది. నిజమే! నేను అమితంగా అభిమానించే, ప్రేమించే వ్యక్తులే నన్నూ ప్రాణప్రదంగా చూసుకోడం నిజంగా నా అదృష్టమే! అమ్మా,నాన్నా, నువ్వూ... నాకేమీ పెద్ద పెద్ద కోరికలు లేవు. మీరు చాలు ...నాకింకేమీ అవసరంలేదీ జీవితానికి..."

చక్కిలిపై రాలిన ఆనంద భాష్పాలని అతను సుతారంగా ముద్దాడి దగ్గరకు తీసుకున్నాడు.

నిష్కల్మషమైన ప్రేమని చూస్తే పులకరించని ప్రకృతుండదు.

పౌర్ణమి గడచి మూడు రోజులైనా వెన్నెలింకా కురుస్తూనే ఉంది.

000000000000

ఫిరోజ్‌షా కోట నిర్మాణానికి మానసికంగా సంసిద్ధుడయ్యాడు. తమ్ముడు అహ్మద్‌ఖాన్ కోట కట్టడానికి పనులు చురుగ్గా మొదలుపెట్టాడు. అన్నగారి దగ్గర కొత్త కోట విషయం అవకాశం చూసుకొని ఇప్పుడైతే ప్రస్తావించాడు కానీ, ఈ పథకానికి అతను కొన్నేళ్ళ క్రితమే పని మొదలెట్టాడు. చాన్నాళ్ళ క్రితమే ఢిల్లీలోని ఫతేపూర్ సిక్రీ నమూనాని రహస్యంగా తెప్పించాడు. అన్నగారిక్కూడా తెలియనివ్వ లేదు. కోట నిర్మాణానికి ఫిరోజ్‌షా ఆమోద ముద్ర వచ్చింది. ఇహ ఏ అడ్డంకులూ లేకుండా సాగేలా చూడాలి. ఏదయినా అభ్యంతరం అంటూ వస్తే గిసుదరాజ్ నుండే రావాలి. దాన్నీ ఎలా తిప్పి కొట్టాలో ముందుగానే ఆలోచించాడు. గిసు దరాజ్ అభ్యంతరం

లేవనెత్త కుండా ముందు చూపుగా అన్నగారి చేత రాజ మహలుకి పిలిపించాడు. గుల్బర్గాలో నీటి కరువు ఎప్పటినుండో వుందనీ, అది తీర్చడానికి భీమ నది నుండి కాలవలు తవ్వాలన్న ప్రతిపాదన చేస్తూ గిసుదరాజ్‌ని ఆహ్వానించాడు. ప్రజల క్షేమమంటే గిసుదరాజ్ రాకుండా ఉండడని తెలుసు.

ఆ సాయంత్రం గిసుదరాజ్ అతని అనుచరుడు ఇంతియాజ్‌తో కలిసి వచ్చాడు. సుల్తాన్ ఫిరోజ్‌షా స్వాగత సత్కారాలకి మురిసిపోయాడు గిసుదరాజ్. అంతరంగికుల సమక్షంలో అహ్మద్‌ఖాన్ గుల్బర్గాలో నీటి ఎద్దడి విషయం ప్రస్తావించాడు.

"మౌలియా! గిసుదరాజ్! ఈ గుల్బర్గా నగరంలో నీటి కరువు గురించి మీకు తెలియంది కాదు. వర్షాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. చెరువులన్నీ వేసవి రాకుండానే ఎండిపోతున్నాయి. అందువల్ల వేసవిలో నీటి ఎద్దడి నివారణ కోసం భీమ నదిని పాయలుగా చేసి కాలువలు తవ్వించి గుర్బర్గా మళ్ళించాలన్న ఆలోచనొచ్చింది. దీనికి మీ సహాయ సహకారాలు కావాలి.."

ఎంతో వినయం నటించాడు అహ్మద్‌ఖాన్. తమ్ముడి మాటాలనే మరో సారి నొక్కి చెప్పాడు ఫిరోజ్‌షా.

"కాలవలు తవ్వడం మాటలు కాదు. దానికి ఎంతో ధనం వెచ్చించాల్సి వస్తుంది. విజయనగరంతో జరిగిన చిన్నపాటి యుద్ధానికే ధనాగారం నిండుకుంది. కానీ ఈ నీటి కరువు వస్తే వేసవిలో ప్రజలు విలవిల్లాడిపోతారు. ధనం లేదని ఈ పనిని వాయిదా వెయ్యలేను. అలా అని ప్రజల కష్టాలు చూస్తూ నిస్సహాయంగా ఉండలేను. మీరే ఏదో ఒక సలహా చెప్పి దారి చూపించండి గిసుదరాజ్."

"నీ ఆలోచన బావుంది సుల్తాన్! అహ్మద్ చెప్పినట్లుగా ముందుగానే ఈ కాలవలు తవ్వే ఏర్పాటు చెయ్యండి. ధనం చాలదని వెనుకాడద్దు. అవసరమయితే ఈ ఏటికే కొత్త పన్ను వేసి ప్రజలనుండి ధనం సేకరించండి. వచ్చిన ధనాన్ని కాలవలు తవ్వించండి. శుక్రవారం ప్రార్థనకొచ్చినప్పుడు నేనూ ప్రజలకి వివరంగా చెబుతాను. వేంటనే ఈ కాలవ నిర్మాణానికి పూనుకోండి.."

తనేం కావాలనుకున్నాడో అవే మాటలు గిసుదరాజ్ నోట పలికించాడు అహ్మద్‌ఖాన్. గిసుదరాజ్ మాటని ప్రజలు కాదనరు. ఈ కాలవ పేరుతో ధనం సమకూరుతుంది. ఇప్పటికే సగం విజయం చేకూరింది. ఇహ కోట విషయం కూడా తెలివిగా చెప్పి గిసుదరాజ్‌ని ఒప్పించాలి.

"సుల్తాన్! ఈ భీమనది కాలువలు తవ్వడం నాకొదిలి పెట్టండి. వేసవిలోగా దగ్గరుండి పూర్తి చేయించే బాధ్యత నాది. రాత్రింబవల్లు కష్టపడయినా అక్కడే ఉండి ఈ పని నెరవేరుస్తాను." ఆవేశం నటిస్తూ అన్నాడు అహ్మద్‌ఖాన్.

"ఇంకేం. అహ్మద్‌ఖానే స్వయంగా ఈ పనికి పూనుకుంటే అడ్డే ముంది? కానీ...." ఫిరోజ్‌షా తమ్ముణ్ణి మెచ్చుకున్నాడు.

సంశయమేమిటన్నట్లు చూసాడు గిసుదరాజ్. అన్నగారు ఎక్కడ నోరు జారుతాడోనన్న భయంతో ఉన్నాడు అహ్మద్‌ఖాన్.

"కానీ అక్కడ నెలల తరబడి ఉంటే ఈ రాజ్యాన్ని ఎవరి చూస్తారు. వకీల్-ఎ-సుల్తానే లేకపోతే ఈ పరిపాలన ఎవరు చూస్తారు? అహ్మద్, నువ్వు ఇక్కడే ఉండి పరిపాలన చూసుకో! నేనే స్వయంగా ఈ కార్యభారాన్ని నిర్వహిస్తాను..."

అన్నదమ్ములిద్దరూ ఇలా ప్రజాకార్యం చెయ్యాలని పోటీ పడ్డం చూసి సంతోషించాడు గిసుదరాజ్.

"అహ్మద్! సుల్తాన్ చెప్పిందే సబబుగా వుంది. నువ్వు ఇక్కడ పరిపాలన చూసుకో. ఫిరోజ్ చేతుల మీదుగా ఈ కార్యం కానీయడమే రాజ్యానికి మంచిది. ప్రజలూ సంతోషిస్తారు."

"భీమ నది ప్రాంతం చుట్టూ చిన్న చిన్న గ్రామాలున్నా, అక్కడ సుల్తాన్‌కి సౌకర్యాలుండవు. కాబట్టి నేనే వెళతాను." పట్టుదల నటించాడు మరోసారి అహ్మద్‌ఖాన్.

"సౌకర్యాలదేముంది? కావాలంటే ఓ చిన్న భవనాన్ని నిర్మించండి. అందులో ఫిరోజ్‌షా వుంటాడు." గిసుదరాజ్ నోట వచ్చినా ఆ మాటలు ఎంతో కర్ణపేయంగా తోచాయి అహ్మద్‌ఖాన్‌కి. తనేం కావాలనుకుంటున్నాడో అన్నీ గిసుదరాజ్ నోటే పలికిస్తున్నాడు. విజయానికి అతి చేరువలో ఉన్నానని గ్రహించాడు.

"మీ ఆజ్ఞ మౌలియా! మీరు చెప్పినట్లుగానే అక్కడ చిన్న భవనం నిర్మించాక సుల్తాన్ అక్కడకెళ్ళి వుంటారు. భవనానికి మీ పేరే పెడతాము మౌలియా!"

ఫిరోజ్‌షా తమ్ముడి మాటలకి వంతపాడాడు. తన పేరువద్దని భవన నిర్మాణం మొదలు పెట్టమని చెప్పి ఇంటికి పయనమయ్యాడు గిసుదరాజ్. తన పథకం యథాతథంగా అమలయినందుకు అహ్మద్‌ఖాన్ ఆనందానికి అవధుల్లేవు. భవనమని గిసుదరాజ్‌ని నమ్మి బలికించాడు. కొంత పని ముగిసాక భవనాన్ని కోటగా మార్చడం అంత కష్టమైన పనికాదని అతనికి తెలుసు. ఎదుటివారు మన దారిలోకి రావాలంటే మనమే ముందుగా ఓ అడుగు వేస్తే, ఎదుటి వాళ్ళు రెండడుగులు వేస్తారన్న రాజకీయం అతనికి తెలుసు. తను గిసుదరాజ్ దారిలోకి ఒక్కడుగే వేసాడు. కానీ గిసుదరాజ్‌ని మాత్రం భీమనది ఒడ్డున తాను కట్టబోయే కోట వరకూ లాక్కెళ్ళాడు.
ఒకే దెబ్బకి రెండు ఫలాలు. అందులోంచే తన రాజ్య కాంక్షకి విత్తనాలు నాటుకున్నాడు అహ్మద్‌ఖాన్.

000000000000

వేదరాయ శర్మ ఇంట్లో ఆ మర్నాడు చవితిన ఆబ్దీకం ఉంది. ఆ నాటికి తన శిష్యుల్నీ భోజనానికి పిలిచాడు. రేవన్న దగ్గరుండి కావల్సిన పనులు చేస్తున్నాడు. ఆబ్దీక తతంగం ముగిసింది. శిష్యులందరూ వచ్చారు కానీ నేహల రాలేదు. భోజనాలకి కూర్చుంటుండగా నేహల ఆలస్యంగా వచ్చింది.

వస్తూనే అందరినీ విశేషంగా ఆకర్షించింది. ఎప్పుడూ సాదా సీదాగా ఉండే నేహల బంగారు నగలు ధరించి వచ్చింది. నుదుటన బంగారు పాపిడి బొట్టూ, చేతులకి వంకీలూ, సిగపైన రాళ్ళతో పొదిగిన సూర్య, చంద్రులూ, చేతినిండా కంకణాలూ, మెడలో కాసుల పేరూ ధరించి వచ్చింది. అవన్నీ ధరించి ఆభరణాలకే వన్నె తెచ్చినట్లనిపించాయి ఆమెను చూస్తున్న అందరికీ. సూర్యుని ముందు దివిటీలా ఆమె ముగ్ధమోహన సౌందర్యం ముందు వెలవెల బోతున్నాయనిపించినట్లుగా వుంది. రేవన్న రెప్పేయకుండా చూస్తున్నాడు. రేవన్నే కాదు, అక్కడున్న అందరి కళ్ళూ నేహల మీదే! కళ్ళు చెదిరే అందం ఆమెది. అందరూ తనకేసే తేరపార చూస్తూంటే సిగ్గు పడిపోయింది నేహల. వారి చూపులకి కారణం తన అలంకరణే అని అర్థమయ్యింది.

"ఇవాళ మా నాయనమ్మ పుట్టినరోజట. మా నాన్న ఆమె గుర్తుగా నన్ను ఈ నగలు పెట్టుకోమని బలవంతం చేస్తే - కాదన లేక..." మాటలు తడబడిపోయాయి.

"నేహలా! నీ అందాని భరణాలు అవసరమా చెప్పు? కుందనపు బొమ్మలా వుంటావు. అందరి కళ్ళూ నీ మీదే పడుంటాయి. సుభద్రా, నేహలకి ముందు దిష్టి తీయి." వేదరాయశర్మ భార్యకి చెప్పాడు.

వేదరాయశర్మ భార్య సుభద్ర వచ్చి దిష్టి తీస్తూ అంది.

"పాలరాతి బొమ్మలా ఉన్నావు. ఇంటికెళ్ళగానే మీ అమ్మనీ దిష్టి తీయమను. ఇలా అన్ని నగలూ పెట్టుకొని అందరి ముందుకూ రాకు. అందరికీ మతి భ్రమిస్తుంది.." సుభద్ర మాటలకి అందరూ నవ్వేసారు.

భోజనాలకి రమ్మనమని విస్తళ్ళు పంక్తిలా వేసాడు రేవన్న. నేహల భోజనం చెయ్యకుండా వెళిపోయింది. నాయనమ్మ గుర్తుగా తండ్రి వాళ్ళింట్లో విందు ఏర్పాటు చేసాడని చెప్పి, గురువు గారి వద్ద శలవు తీసుకుంది. ఎవరూ చూడకుండా సాయంత్రం గుడికి రమ్మనమని రేవన్న చెవిలో మెల్లగా చెప్పింది.

భోజనాల వద్ద మరలా నేహల ప్రసక్తే వచ్చింది. అందానికి తగ్గ సౌశీల్యత; దాన్ని మించిన విద్యా; విద్యను మించిన వినయమూ - సుగుణాల రాశి అంటూ అందరూ నేహలని పొగిడారు.

"నేహల్ని చూస్తే ఓ రాణీలా ఉంటుంది. ఎవరు పెళ్ళాడుతారో ఏమిటో? ఇలా మన మధ్యుండాల్సిన పిల్ల కాదు. ఏ మహారాజ కుమారుడో పెళ్ళి చేసుకోవాల్సిన అందం ఆమెది. " అంటూ సుభద్ర భోజనాల మధ్య అంది.

"అవును. నువ్వు చెప్పిందీ నిజమే! దేవరాయలు కొత్తగా గజపతుల వారమ్మాయిని మూడో రాణిగా తెచ్చుకున్నాడు. అందరూ చాలా అందగత్తె అని పొగిడితే ఏవిటో అనుకున్నాం. తీరా చూస్తే మామూలుగానే ఉంది. చెప్పుకోదగ్గ అందమేమీ కాదు. మహారాణీ కదా? వైభవంతో వచ్చిన అందం కానీ, స్వతహాగా వచ్చింది కాదు. ఏ మాటకామాటే చెప్పుకోవాలి. నేహల అందమ్ముందు కొత్త రాణీ దిగదుడుపే! " వేదరాయ శర్మా భార్య మాటలకి వంత పాడాడు.

ఈ మాటలు విని అక్కడే వున్న ప్రభ రేవన్న కేసి చూసి నవ్వింది.

రేవన్నకి  ఆ నవ్వుకర్థం తెలుసు. ఒక్క సారి అతని చాతీ విచ్చుకుంది.

తనూ ఒక రాకుమారుడే అన్నట్లు సైగ చేసాడు.

భోజనానంతరం అందరూ వెళిపోయారు. రేవన్న కూడా గురువుగారి వద్ద శలవు తీసుకొని నేహలా వాళ్ళింటికి బయల్దేరాడు.

ఆనాటి రాత్రి కూడా వేదరాయశర్మ ఇంట్లో నేహల ప్రస్తావనే వచ్చింది. కూతురులాంటి నేహల్ని చూస్తే వేదరాయశర్మకీ, సుభద్రకీ ఎంతో ఇష్టం. నేహలకి మంచి జరగాలని కోరుకునే వాళ్ళల్లో ముఖ్యులు వారిద్దరూ! ఒక్కోసారి ఒకరి మంచి వుద్దేశ్యాలు మరొకరికి ఉపద్రవాలుగా పరిణమించచ్చు. వేదరాయశర్మకి నేహల ఎడల మంచి ఉద్దేశ్యమే వుంది. ఆనాడు అలంకరణతో వేదరాయశర్మింటికి రావడమే నేహల చేసిన పెద్ద తప్పు.

ఆ విషయం ఆమెకప్పుడు తెలీదు. తెలియడానికామె కాలజ్ఞాని కాదు.. కాలమనే గాలానికి చిక్కుకున్న అందాల బొమ్మ. వెరశి నేహల. అంతే!

000000000000

కాల చక్రం గిర్రున తిరిగింది. చూస్తూండగా శీతాకాలం వచ్చేసింది. భీమనది నుండి కాలువలు తవ్వకం ఒక పక్క మొదలు పెట్టినా, అహ్మద్‌ఖాన్ దృష్టంతా కోట నిర్మాణమ్మీదే ఉంది.

భారీ ఎత్తున కోట భవనం నిర్మాణానికి సన్నాహాలు మొదలుపెట్టాడు. ఎంతో పకడ్బందీగా కోట నిర్మాణం జరగాలని అనుకున్నాడు. అత్యంత నమ్మకస్తుల్ని తప్ప ఎవరినీ ఈ పనిలో పెట్ట లేదు. కోట నిర్మాణానికి కావల్సిన చలువ రాళ్ళూ, బండరాయి ఇటుకలూ పురమాయించాడు. అన్నీ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాడు. అతనికి గుల్బర్గా ప్రాంతంలో శిల్పుల పనితనం అంతగా నచ్చలేదు. రాయచూరు ప్రాంతంలో పనితనమున్న శిల్పులున్నారని విన్నాడు. వారిని ఈ పనికి రప్పించడం కష్టం. రప్పించడం కంటే ఒప్పించడం అంత సులభం కాదని తెలుసు. వారికి ఎంత ధనమైనా ఇచ్చి పనిలోకి తీసుకురావాలని తీర్మానించుకున్నాడు. తన అనుచరులని ఈ పని మీదే ఉండమని చెప్పాడు.

ఓ రోజు అతని దగ్గర ఒక ఉద్యోగి ఒక వ్యక్తిని తీసుకొచ్చాడు.

"హుజూర్! మీరు చెప్పినట్లుగానే రాయచూరు ప్రాంతమంతా గాలించాను. అక్కడున్న కొంతమంది శిల్పులని ఈ పనికొప్పించడానికొక దళారీని తీసుకొచ్చాను. ఇతను వారిని ఒప్పించి తీసుకొస్తాడు."

వచ్చిన వ్యక్తి అహ్మద్‌ఖాన్‌కి సలాం చేసాడు. అతనికేసి తేరపార చూసాడు అహ్మద్‌ఖాన్.

నమ్మకస్తుడిలాగే అనిపించాడు.

" శిల్పులకి అడిగినంతా కానుకలూ ఇస్తాం. కానీ ఇది రహస్యంగా జరగాలి. ఏ మాత్రం తేడా వచ్చినా..."

"జీ హుజూర్! ఈ పని వెనుకున్న రహస్యం నాకు తెలుసు. ఎవరికీ తెలియనివ్వను. అంతా రహస్యంగానే జరుగుతుంది. నన్ను నమ్మండి..."

"సరే! ఇతనికి కావల్సిన ధనం ఇవ్వండి. ఇతనేం చెయ్యాలో వివరంగా చెప్పండి.." అంటూ అనుచరులని  ఆదేశించి మందిరానికి వెళ్ళడానికి సింహాసనం నుండి లేచాడు. వకీల్కి అందరూ దారిస్తూ పక్కకు తప్పుకున్నారు.

రెండడుగులు వేసి మరలా వెనక్కి వచ్చాడు. కొత్తగా వచ్చిన  ఆ వ్యక్తిని సంబోధిస్తూ -

"ఇంతకీ, నీ పేరు?"  అంటూ అడిగాడు.

అతను చిన్నగా తలెత్తి చెప్పాడు.

"మసూం"

అహ్మద్‌ఖాన్ అతని సమాధానం విని ముందుకు సాగాడు.

00000000000000000

.

.

(కొనసాగింపు వచ్చేసంచికలో)

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..




Click here to go to KOUMUDI Library